ఫరా ఇంజినీరింగ్ కళాశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, కలెక్టర్ శశాంక, అధికారులు

సభ ఏర్పాట్ల పరిశీలన

ఈ నెల 27న చేవెళ్లలో 200 యూనిట్ల విద్యుత్తు, రూ. 500కే గ్యాస్ సిలిండర్ పథకాల ప్రారంభం

చేవెళ్లటౌన్, ఫిబ్రవరి 23 : ఆరు గ్యారెంటీ పథకాల్లో భాగంగా గృహజ్యోతి (200 యూనిట్ల విద్యుత్తు), రూ. 500కే గ్యాస్ సిలిండర్ పథకాలను ఈ నెల 27వ తేదీన చేవెళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించనున్న దృష్ట్యా భారీ బహిరంగ సభకు ఆ పార్టీ నాయకులు ఏర్పాటు చేస్తున్నారు. బహిరంగ సభను మండల కేంద్రంలోని ఫరా ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించారు. కాగా శుక్రవారం సాయంత్రం మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, కలెక్టర్ శశాంక, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జితో పాటు పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు బహిరంగా సభ స్థలాన్ని పరిశీలించారు. అక్కడే హెలికాప్టర్ దిగ్గేందుకు అనువైన స్థలాన్ని కూడా పరిశీలించారు. అనంతరం బహిరంగా సభ ఏర్పాట్లపై జిల్లా, మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. సభ ఏర్పాట్లు తొందరగా పూర్తి కావాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు వేంకటేశ్వరరావు, శ్రీలత, సాయిరాం, కృష్ణయ్య, హిమబిందు, రాజేశ్, కిషన్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి.. సెటిల్మెంట్ సీఎం

- బీజేపీ జాతీయ నాయకుడు మురళీధర్‌రావు
- మండలంలో బీజేపీ విజయ సంకల్పయాత్ర

యాచారం, ఫిబ్రవరి 23 : రేవంత్‌రెడ్డి సెటిల్మెంట్ సీఎం అని బీజేపీ జాతీయ నాయకుడు మురళీధర్ రావు విమర్శించారు. బీజేపీ విజయ సంకల్పయాత్ర శుక్రవారం మాల్, యాచారం మండల కేంద్రాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా మురళీధర్‌రావు మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల పేరుతో పదవిలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి మూడు నెలలు దాటినా వాటిని అమలు చేయకపోవడం సిగ్గు చేటన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప రాష్ట్రానికి ఆయన ఒరుగబెట్టిందేమీలేదన్నారు. పక్కనే ఉన్న శివన్నగూడ ఎత్తిపోతలను కాంగ్రెస్ సర్కారు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కొడంగల్ అభివృద్ధికి రూ.50కోట్లు ప్రకటించిన సీఎం వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిని పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మూడు నెలల వ్యవధిలోనే రేవంత్ అసమర్థ పాలన బయటపడిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తూ కరువును వెంట తీసుకొచ్చిందని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం, ఫార్మాసిటీ, మైనింగ్ జోన్ తదితర ప్రాజెక్టులతో సీఎం రేవంత్ సెటిల్మెంట్ చేసుకున్నారని మండిపడ్డారు. వెంటనే ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను గద్దెదించడమే బీజేపీ ప్రధాన ధ్యేయమన్నారు. కార్యక్రమంలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు భాష, ఎంపీ సుకన్య, మండలాధ్యక్షుడు రవీందర్, శ్రీధర్‌రెడ్డి, రాజు, అంజయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలను విమర్శించటమే పనిగా..

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 23 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాలను విమర్శించడమే పనిగా పెట్టుకున్నదని బీజేపీ శాసనసభా ఉపనాయకుడు కాటేపల్లి వెంకట్రాంరెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన బీజేపీ విజయ సంకల్పయాత్రకు వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడుతూ..ఎన్నికలకు ముందు ఆరుగ్యారెంటీల పేరుచెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వెంటనే హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యదర్శి మురళీధర్‌రావు, మాజీ ఎంపీ నర్సయ్యగౌడ్, పార్టీ నాయకులు భాష, నర్సింహారెడ్డి, అర్జున్‌రెడ్డి, భాస్కర్, మనోహర్‌రెడ్డి, పాపారావు, వెంకట్‌రెడ్డి, ప్రతాప్, వీరేందర్‌గౌడ్, లచ్చిరెడ్డి, సత్యనారాయణ, నర్సింహారెడ్డి, రాంరెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

యాచారం : విజయ సంకల్ప యాత్ర ర్యాలీలో మాట్లాడుతున్న మురళీధర్‌రావు

మాట్లాడుతున్న బీజేపీ మహిళా నాయకురాలు డీకే అరుణ

కాలం కలిసొచ్చి సీఎం అయ్యాడు..

బీజేపీ మహిళా నాయకు రాలు డీకే అరుణ

షాద్‌నగర్, ఫిబ్రవరి 23: కాలం కలిసొచ్చి ఏదో గారెల బుట్టలో పడ్డాడు కానీ.. తన తెలివితేటలు.. రాజకీయ పరిజ్ఞానంతో రేవంత్‌రెడ్డి తెలంగాణ సీఎం కాలేదని మాజీ మంత్రి, బీజేపీ మహిళా నాయకురాలు డీకే అరుణ విమర్శించారు. శుక్రవారం షాద్‌నగర్ ఏబీ కాంప్లెక్స్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రవహిస్తున్న నదులు, ప్రాజెక్టులు, ఆయకట్టు, నీళ్ల వాటా, నూతన ప్రాజెక్టుల నిర్మాణాలపై ప్రస్తుత సీఎంకు కనీస అవగాహన కూడా లేదన్నారు. ప్రాజెక్టులకు జాతీయ హోదా అనేది పాత పద్ధతి అని.. బీజేపీ పాలనలో దేశంలోని నదులన్నింటినీ అనుసంధానం చేసి రైతాంగానికి సాగునీరు ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రధాని మోదీ పని చేస్తున్నారన్నారు. ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యలు, హామీలను గాలికి వదిలేసిందని ఆమె మండిపడ్డారు. బీజేపీ నాయకులను విమర్శించే స్థాయి కాంగ్రెస్ నేతలకు లేదన్నారు. వ్యక్తిగత విమర్శలు చేస్తే తగిన విధంగా సమాధానం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాబయ్య, నామోజీ, శ్రీవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్

దారుణ హత్య

హర్యానాయక్ (ఫైల్)

చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 23 : విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్ దారుణహత్యకు గురయ్యాడు. ఈ ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధి ఆలూర్‌లోని సబ్‌స్టేషన్‌లో జరిగింది. చేవెళ్ల ఎస్ఐ ప్రదీప్‌కుమార్ కథనం ప్రకారం..శంకర్‌పల్లి మండలంలోని మోకిల గ్రామానికి చెందిన హర్యానాయక్(40) ఆలూర్ గ్రామంలో ఉన్న విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి సబ్‌స్టేషన్‌లో విధులకు హాజరయ్యాడు. కాగా రాత్రి 12:40 గంటలకు గ్రామానికి చెం దిన వాటర్‌లైన్‌మన్ ఎల్లకొండ శ్రీనివాస్‌కు ఫోన్ చేసి కొంతమంది నేపాల్ రాష్ట్రానికి చెందిన వ్యక్తులు నాతో గొడవ పడుతున్నారని వెంటనే సబ్‌స్టేషన్‌కు రావాలని కోరాడు. అయితే అతడు గ్రామంలో జరిగిన జాతర ఉత్సవాల్లో ఉండడంతో రాత్రి 2:30 గంటలకు వెళ్లి చూడగా హర్యానాయక్ రక్తపు మడుగులో పడి మృతి చెంది ఉన్నాడు. ఆందోళన చెందిన శ్రీనివాస్ వెంటనే ఏఈ జానీమొహినుద్దీన్‌కు సమాచారం ఇవ్వగా అతడు సబ్‌స్టేషన్‌కు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డబ్బుకోసమే దుండగులు హత్యచేసినట్లు విద్యుత్తు శాఖ అధికారులు, పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరేసుకుని టీసీఎస్ ఉద్యోగి ఆత్మహత్య

ఆదిబట్ల, ఫిబ్రవరి 23 : ఉరేసుకుని ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా, వేములపల్లి మండలం, చింతలపూడి గ్రామానికి చెందిన నాగచంద్రప్రకాశ్(24) ఆదిబట్లలోని టీసీఎస్ కంపెనీలో 2021నుంచి కంప్యూటర్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్నా డు. స్నేహితులతో కలిసి టీసీఎస్ కంపెనీ ఎదుట ఉన్న ఓ కాలనీలోని ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. కాగా శుక్రవారం తెల్లవారుజామున తన గదిలోని ఫ్యాన్‌కు బెడ్‌షీట్‌తో ఉరేసుకున్నాడు. గమనించిన స్నేహితులు అతడిని కిందికి దింపి దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అతడు కొన్ని రోజులుగా ఓ అమ్మాయికి మెసేజ్‌లు చేసేవాడు. అతడి తల్లిదండ్రులకు సై తం నన్ను క్షమించండి అంటూ మెసేజ్ చేసినట్లు తెలిసింది. ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమా..? మరెమన్నా కారణాలు ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

ఎంసీఏ ప్రాక్టికల్ పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 23 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంసీఏ మొదటి సెమిస్టర్ మెయిన్, మొదటి, రెండో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ ప్రాక్టికల్ పరీక్షలను ఈ నెల 27వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

- యూనివర్సిటీ పరిధిలోని పీజీ డిప్లొమా ఇన్ ఎర్లీ ఇంటర్వెన్షన్ పరీక్షా ఫలితాలను విడుదల చేశారు.
- యూనివర్సిటీ పరిధిలోని బ్యాచ్‌లర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సు మూడో సెమిస్టర్ మెయిన్, రెండో సెమిస్టర్ సప్లమెంటరీ పరీక్షా ఫీజును ఈ నెల 29వ తేదీ వరకు సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని అధికారులు తెలిపారు. వచ్చే నెలలో పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

మారుత్ డ్రోన్‌కు భారత ప్రభుత్వ గుర్తింపు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ డ్రోన్ స్టార్టప్ మారుత్ డ్రోన్స్‌టెక్ కంపెనీకి భారత ప్రభుత్వం నుంచి గుర్తింపు వచ్చింది. తెలంగాణలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సహకారంతో అభివృద్ధి చేసిన 'డైరెక్ట్ సీడింగ్ డ్రోన్ యుటిలిటీ టెక్నాలజీ'కి పేటెంట్ దక్కిందని మారుత్ డ్రోన్ వ్యవస్థాపకులు, సీఈఓ ప్రేమ్‌కుమార్ తెలిపారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగం కోసం రూపొందించిన టెక్నాలజీ రైతులకు ఎంతో మేలు చేసేలా ఉంటుందన్నారు.

వికారాబాద్ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న బీఆర్ఎస్ జడ్పీటీసీలు

గడువులోగా బలపరీక్ష నిర్వహించండి

వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డిని కోరిన బీఆర్ఎస్ జడ్పీటీసీలు

వికారాబాద్, ఫిబ్రవరి 23(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీలో చేరిన జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డిపై ఇచ్చిన అవిశ్వాస తీర్మానంపై స్పందించి గడువులోగా బలపరీక్ష నిర్వహించాలని బీఆర్ఎస్ జడ్పీటీసీలు కలెక్టర్ నారాయణరెడ్డిని కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కలెక్టర్‌ను కలిసిన జడ్పీ వైస్ చైర్మన్ బైండ్ల విజయ్‌కుమార్, కులకచర్ల, దౌల్తాబాద్, దోమ జడ్పీటీసీలు వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లాలో మొత్తం 18 మంది జడ్పీటీసీలు ఉండగా, మూడింట రెండో వంతు సభ్యులు అంటే 12 మంది జడ్పీటీసీల మద్దతు ఉండడంతో నిర్ణీత గడువులోగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని జడ్పీటీసీలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అయితే జడ్పీలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే అధికారం కలెక్టర్‌కు ఉందా..? జడ్పీ సీఈవోకు ఉందా అనే విషయంపై స్పష్టత లేకపోవడంతో ప్రభుత్వానికి కలెక్టర్ నారాయణరెడ్డి లేఖ రాసినట్లు సమాచారం. మూడుసార్లు జడ్పీ చైర్‌పర్సన్‌గా బీఆర్ఎస్ పార్టీ అవకాశమివ్వగా అధికార వ్యామోహంతో సునీతారెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో ఈనెల 17న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు జడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలని కోరుతూ 12 మంది బీఆర్ఎస్ జడ్పీటీసీలు నోటీసు అందించిన విషయం తెలిసిందే. మరోవైపు అవిశ్వాస నోటీసు ఇచ్చిన 14 రోజుల్లోగా ఓటింగ్‌కు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.. మరీ అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు మరో ఏడు రోజుల సమయమే ఉన్నది.

హరితహారం లక్ష్యాన్ని అధిగమించాలి

వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

వికారాబాద్, ఫిబ్రవరి 23 : జిల్లాలో హరితహారం లక్ష్యాన్ని అధిగమించేలా అధికారులు పనిచేయాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో తెలంగాణకు హరితహారం కార్యక్రమ కార్యాచరణ ప్రణాళికపై అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరితహారంలో గతేడాది ఇచ్చిన లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు చాటాలన్నారు. శాఖలవారీగా ఇచ్చిన లక్ష్యాల్లో ఔషధ మొక్కలు నాటేందుకు అధిక ప్రాధాన్యమివ్వడంతోపాటు రోడ్లకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్ ద్వారా పెద్ద మొక్కలు నాటేందుకు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లోని ఖాళీ స్థలాల్లో పంచాయతీలకు ఇచ్చిన లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటాల న్నారు. సమావేశంలో డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్, డీఆర్‌డీవో అధికారి శ్రీనివాస్, పరిశ్రమలశాఖ అధికారి వినయ్‌కుమార్, పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ అనిల్‌కుమార్, వ్యవసాయ శాఖ అధికారి గోపాల్, జిల్లా గనులశాఖ అధికారి జాకబ్, ఉద్యానవనశాఖ అధికారిణి అర్చన, మున్సిపల్ కమిషనర్ మహ్మద్ జాకీర్‌అహ్మద్, ఆయా శాఖల సిబ్బంది వెంకటయ్య, బలరాంనాయక్, విక్రమ్‌సింహారెడ్డి పాల్గొన్నారు.

వాహనదారులకు మెరుగైన సేవలు

సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్స్ కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్

మణికొండ, ఫిబ్రవరి 23: వాహనదారులకు మరింత మెరుగైన సేవలందించాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రవాణా శాఖ అధికారులను డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్ ఆదేశించారు. మణికొండలోని రంగారెడ్డి జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో రంగారెడ్డి, మేడ్చల్- మల్కాజిగిరి, వికారాబాద్ జిల్లాల రవాణా శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రవాణా శాఖ కార్యాలయంలోని హెల్ప్ డెస్క్‌లను మరింత పటిష్టం చేయాలన్నారు. టీ-ఆఫ్ ఫోలియో ద్వారా జరిగే ఆన్‌లైన్ సేవలపై వాహనదారులకు అవగాహన కల్పించాలన్నారు. వాహనదారులు తమ సమస్యల పరిష్కారానికి ట్రాన్స్‌పోర్ట్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేస్తే.. వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. సమావేశంలో రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్ జిల్లాల రవాణా శాఖ అధికారులు వెంకటరెడ్డి, రఘునందనగౌడ్, వాణి, సుభాష్‌చంద్రారెడ్డి, కిరణ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, నవీన్, సునీత, కృష్ణవేణి, వాసు, శ్రీనుబాబు, బాబు, శ్రీరాం, రామకృష్ణ, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సరఫరాలో అంతరాయం ఉండొద్దు

- రంగారెడ్డి జిల్లా విద్యుత్తు శాఖ ఎస్ఈ కరుణాకర్
- వేసవిలో విద్యుత్తు సరఫరాపై ఇబ్రహీంపట్నంలో సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి జిల్లా విద్యుత్తు శాఖ ఎస్ఈ కరుణాకర్

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 23: వేసవిని దృష్టిలో ఉంచుకుని సరఫరాలో ఎలాంటి అంతరాయం తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా విద్యుత్తు శాఖ ఎస్ఈ కరుణాకర్ సూచించారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలో రంగారెడ్డి తూర్పు డివిజన్ విద్యుత్తు ఉద్యోగుల సమీక్షా సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో వ్యవసాయదారులు, గృహ వినియోగదారులకు విద్యుత్తు సమస్య తలెత్తకుండా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలన్నారు. ఎక్కడైనా విద్యుత్తు అంతరాయం ఏర్పడితే సిబ్బంది సకాలంలో స్పందించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. వేసవిలో ప్రజలకు 24 గంటలపాటు సరఫరా అందుబాటులో ఉండాలని.. లోటుపాట్లు లేకుండా ఏఈలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 10గంటల వరకు అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా వారివారి ఎఫ్‌వోసీ పరిధిలో విద్యుత్తు సరఫరాను పర్యవేక్షించాలని సూచించారు. అలాగే, ఓవర్‌లోడ్ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లపై దృష్టి సారించాలని, అవసరమైతే అక్కడే అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. మారుమూల గ్రామాల్లోనూ సమస్య తలెత్తకుండా అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు.

ఫిర్యాదులపై కంట్రోల్ రూం ఏర్పాటు..

విద్యుత్తు పరంగా ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే సమాచారం అందించేందుకు ఇబ్రహీంపట్నంలో కంట్రోల్‌రూంను ఏర్పాటు చేస్తామని రంగారెడ్డి జిల్లా విద్యుత్తు శాఖ ఎస్ఈ కరుణాకర్ తెలిపారు. కంట్రోల్ రూం నంబర్ 7901679895కు ఫోన్ చేయాలని వినియోగదారులకు సూచించారు. వేసవిలో 15 శాతం విద్యుత్తు వినియోగం పెరిగే అవకాశమున్నందున అందుకనుగుణంగా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సరూర్‌నగర్, ఇబ్రహీంపట్నం డీఈలు రామకృష్ణ, యాదగిరి, ఏడీఈలు సైదులు, ప్రభాకర్, ఏఈలు వేణుగోపాల్, ఉదయ్, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

పింఛన్ కష్టాలు

పింఛన్ డబ్బుల కోసం లబ్ధిదారులు పోస్టాఫీస్‌ల వద్ద నిరీక్షిస్తున్నారు. గత బీఆర్ఎస్ హయాంలో సక్రమంగా పంపిణీ జరిగేదని..కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇబ్బందులకు గురవుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ప్రభుత్వం పింఛన్‌దారులకు ప్రతినెలా రూ. 2016 అందిస్తుండగా పోస్టాఫీస్ సిబ్బంది రూ.16 ఇవ్వకుండా కేవలం రూ.2000 మాత్రమే ఇస్తున్నారని పేర్కొంటున్నారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు యాదయ్య మాట్లాడుతూ పింఛన్ డబ్బుల కోసం లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారని.. దురుసుగా వ్యవహరిస్తున్న పోస్టాఫీస్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. -తుర్కయంజాల్, ఫిబ్రవరి 23

పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 23 : హైదరాబాద్, రామంతాపూర్ పబ్లిక్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశానికి షెడ్యూల్డ్ కులాల బాల బాలికలు 2024-25 సంవత్సరానికి దరఖాస్తు చేసుకోవాలని మేడ్చల్ జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి 12వ తేదీలోపు పూర్తిచేసిన దరఖాస్తులను కలెక్టరేట్‌లో అందజేయాలని తెలిపారు. అర్హులైన దరఖాస్తు దారులకు మార్చి 15వ తేదీన అదనపు కలెక్టర్(రెవెన్యూ)కార్యాలయంలో లాటరీ నిర్వహించి ఎంపిక చేస్తారని అన్నారు. ఇతర వివరాలకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

చేవెళ్ల ఆర్టీసీ డిపోలో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

బస్సుల కొరత ప్రయాణికుల ఇక్కట్లు

మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు జిల్లా బస్సులను ఆర్టీసీ కేటాయించడంతో చేవెళ్ల డిపోలో బస్సుల కొరత ఏర్పడింది. దీంతో ప్రయాణికులు బస్సులు లేక శుక్రవారం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొందరు బస్సులు రాకపోవడంతో ప్రైవేట్ వాహనాల్లో తమతమ గమ్య స్థానాలకు చేరుకున్నారు.